సాక్షి
సిద్దిపేట
గురువారం, 23 ఫిబ్రవరి 2023



మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

సిద్దిపేట పట్టణ, సమీప గ్రామాల ప్రజలకు నాణ్యమైన మాంసం, పండ్లు, పూలు అందించే లక్ష్యంతో మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించనున్నారు. 8లో..



మొక్కజొన్నకే మొగ్గు 8లో..

సంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో మొక్కజొన్న సాగు పెరిగింది. దాదాపు 25 వేల ఎకరాల్లో పంట సాగైనట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.



భార్యను చంపింది భర్తే 8లో..

వివాహిత హత్యకేసును పోలీసులు ఛేదించారు. హత్య చేసింది భర్తనే అని తేల్చారు. సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి బుధవారం ఆ వివరాలు వెల్లడించారు.

వీధి వీధిలో కుక్కల గోల



జిల్లాలో పెరుగుతున్న బెడద

- రోజుకు సగటున 15 మందికి కాటు
- రాత్రి వేళ స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- ఏడాదిగా తెరుచుకోని ఏబీసీ కార్యాలయం
- హైదరాబాద్ ఘటనతో పెరిగిన ఆందోళన

కుక్కకాటు కేసుల వివరాలు

సంవత్సరం	సంఖ్య
2019	6,805
2020	4,625
2021	6,062
2022	5,628

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో రోజురోజుకు కుక్కల బెడద తీవ్రమవుతోంది. పల్లె, పట్టణాలు అనే తేడా లేకుండా రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ బాధితులే. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 696 మందిని కాటు వేశాయి. ఈ సంఖ్యను బట్టి అర్థం చేసుకోవచ్చు గ్రామ సింహాల తీవ్రత. బాధితుల సంఖ్య పెరుగుతున్నా వీధి కుక్కలపై నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో నాలుగేళ్ల బాలుడిని కుక్కలు దాడి చేసి హతమార్చిన ఘటనతో జిల్లాలో మరింత భయాందోళన పెరిగింది.

రాత్రి వేళ మరీ అధికంగా..

- ఇంట్లో నుంచి బయటకు వెళ్తే చాలు రోడ్లపై, నిలిచి ఉన్న వాహనాల కింద సేద తీరుతూ గుంపులు గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి.
- వాటిని చూస్తేనే మహిళలు, చిన్న పిల్లలు జంకుతున్నారు. వీటికితో తోడు రోడ్లపై ఇష్టారీతిన తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు సైతం కారణమవుతున్నాయి.
- వాహనాలకు అడ్డం రావడంతో వాటిని తప్పించేందుకు యత్నించి అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.
- మరీ ముఖ్యంగా రాత్రి సమయంలో కుక్కలు గుంపులుగా చేరి అరుస్తూ అటుగా వెళ్లేవారి దగ్గరకు వస్తుంటాయి. అలాగే వాటి అరుపులతో గ్రామాలు, పట్టణాల్లోని పలు కాలనీల్లో నిద్రలు లేకుండా చేస్తున్నాయి.
- కుక్క కాటుకు ఇంజక్షన్లు వేసుకునే వారు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న వారి లెక్కల ద్వారా జిల్లా వ్యాప్తంగా సగటున ఎక్కడో ఒక దగ్గర 15 నుంచి 18 మంది కుక్క కాటుకు గురవుతున్నట్లు తెలుస్తుంది. ఇంకా కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారి వివరాలు తెలియని పరిస్థితి.
- కుక్క కరిసిన వారు చికిత్స ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన రేబిస్ వ్యాధితో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. సాధారణ కరిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, సిద్దిపేట జీజీహెచ్‌కు వెళ్లి ఇంజక్షన్లు వేయించుకుంటున్నారు.
- పెంపుడు కుక్కలకు స్థానికంగా ఉండే పశువైద్యశాలలో ఇంజక్షన్ ఇస్తారు. దీంతో అవి కరిసినా ప్రాణాలకు ఎలాంటి ముప్పు ఉండదు.
- గ్రామ పంచాయతీ వారు పశు వైద్య అధికారులు తమకెందుకు తలనొప్పి అని వాటిని వదిలేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది.

చర్యలు తీసుకుంటాం

జిల్లాలో కుక్కల కట్టడికి చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో తిరిగే వీధి కుక్కలను గుర్తించి పంచాయతీలు, పశు వైద్యశాలల పరస్పర సహకారంతో చర్యలు తీసుకుంటాం.

–దేవకీదేవి, డీపీఓ



సిద్దిపేటలో సంచరిస్తున్న కుక్కలు



సిద్దిపేటలో మూసి ఉన్న యానిమల్ బర్త్ కంట్రోల్

కరువైన ఏబీసీ సేవలు

- సిద్దిపేటలోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కార్యాలయం ఏడాదిగా తెరచుకోవడం లేదు. దీని ద్వారా వీధి కుక్కల బెడద లేకుండా కుటుంబ నియంత్రణలో భాగంగా శస్త్రచికిత్స చేసి గర్భ సంచిని తొలగించే ప్రక్రియ నిర్వహించారు. అదే క్రమంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ పంపిణీ చేశారు.
- ఏడాది వ్యవధిలో దాదాపు 3,500 వరకు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు.
- రెండు వాహనాలను ఏర్పాటు చేసి కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వలలో బంధించి తీసుకవచ్చేవారు.
- కు.ని ఆపరేషన్ చేసిన తర్వాత 5 రోజులకు తీసుకవచ్చిన స్థలంలోనే వదిలేవారు.
- కానీ ఏడాదిగా ఈ సేవలు కనుమరుగయ్యాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి ఏబీసీ సెంటర్‌ను తెరచి జిల్లా వ్యాప్తంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి సంతతిని నియంత్రించాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని ట్రైనీ కలెక్టర్ ఫైజాఅహ్మద్ సూచించారు. బుధవారం మండలంలోని నర్మేట ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం ట్రిపుల్ ఐటీకి ఎంపిక అవడం హర్షణీయమన్నారు. అలాగే వాలీబాల్, టెన్నికాయిట్‌లో రాణిస్తున్న అక్షర, పవన్‌తో పాటు హెచ్‌ఎం యాదగిరి, పీఈటీ రాజ్‌కుమార్, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. ఆయన వెంట సర్పంచ్ అజీద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ ఉన్నారు.

పది ఫలితాల్లో అగ్రగామిగా నిలవాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

జగదేవ్‌పూర్(గజ్వేల్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చాట్లపల్లి, వట్టిపల్లి, మునిగడప, గొల్లపల్లి, కేజీబీవీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతులు, విద్యార్థులు చదువుకుంటున్న తీరును పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలు పురోగతిని సాధించాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, మునిగడప కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఎండీ రహీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ.9.59 లక్షలు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ నర్సాపూర్‌లోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. 34 రోజులకు గాను పలు కానుకల రూపంలో రూ.9,59,357 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివకుమార్, ఆలయ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ అమ్మవారికి కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని ఆలయ ఖాతాలో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజితా రమేశ్, ఎంపీటీసీ కావ్య దుర్గయ్య, పాలక మండలి సభ్యులు కుమ్మరి కనకయ్య, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దు తిరుగుడు పంటకు మద్దతు

రెండు చోట్ల కొనుగోలు కేంద్రాలు

సిద్దిపేటజోన్: పొద్దు తిరుగుడు పంటకు మద్దతు ధర అందించి దళారుల నుంచి రైతులను రక్షించేందుకు ప్రభుత్వం జిల్లాలో రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. రైతుల అభ్యర్థన మేరకు మంత్రి హరీశరావు ప్రత్యేక చొరవ చూపి సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో ఈ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేశారు. ఈ మేరకు మొదటగా సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో గురువారం పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. త్వరలో గజ్వేల్‌లోనూ అందుబాటులోకి రానుంది. కొనుగోలు కేంద్రం మంజూరుకు కృషి చేసిన మంత్రి హరీశరావుకు మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు 'భరోసా'తో సత్వరం సేవలు

పోలీస్ కమిషనర్ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా సెంటర్ ద్వారా వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. కమిషనర్ కార్యాలయంలో భరోసా సెంటర్ సిబ్బందితో మహిళలు, బాలల రక్షణ గురించి తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా పోక్సో, అత్యాచారం కేసులు జరగగానే సంబంధిత బాధితులను నేరుగా భరోసా సెంటర్‌కు తీసుకురావాలన్నారు. రాగానే చట్ట ప్రకారం వారికి అందాల్సిన సూచనలు, సలహాలు తక్షణమే అందించాలన్నారు. బాధితులకు ఎవరూ లేకపోతే బాలసదన్‌లో ఆశ్రయం కల్పించాలన్నారు. భరోసా సెంటర్ సేవల గురించి సంబంధిత బాధితులు డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ 8333998699 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్‌లో గృహహింస, వివిధ వేధింపులకు గురవుతున్న మహిళలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించి కౌన్సెలింగ్ ఇచ్చిన వాటి వాటి వివరాలను సీపీ తెలుసుకున్నారు. గృహహింస, కట్నం తదితర అంశాల గురించి వేధింపులకు గురిచేస్తే వెంటనే స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఏబీ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య



నిరసన తెలుపుతున్న కార్మికులు

గజ్వేల్‌రూరల్: పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవోసీ గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వేతనాలు చెల్లించడంతో పాటు ఆరోగ్య, బీమా సౌకర్యం, పీఆర్సీని సైతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. విషయం తెలుసుకున్న ×గడా×ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రంగారెడ్డి, యాదగిరి, నాగరాజు, జహంగీర్, ఎల్లం, చంద్రం, మహాలక్ష్మి, దుర్గవ్వ, అనిల్, సత్తయ్య, పెంటమ్మ పాల్గొన్నారు.

ఒకేరోజు 16 ఆపరేషన్లు

దుబ్బాక ఆస్పత్రిలో మరో ఘనత

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బుధవారం మరో ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఒకే రోజు దవాఖానాలో 16 ఆపరేషన్లు జరిగాయి. ఇందులో 10 మంది గర్భిణులకు సర్జరీలు చేయగా పండంటి బిడ్డలు జన్మించారు. మరో ఆరుగురికి ఆరోగ్యశ్రీ క్రింద ఇతర ఆపరేషన్లు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్, వైద్యులు అనిత, రాఘవేందర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్లు నిర్వహించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ప్రజలు డబ్బుల వృథా చేసుకోవద్దని దుబ్బాక ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యం అందిస్తామన్నారు.



పది మంది బిడ్డలతో డాక్టర్ల బృందం

ప్రజల రక్షణ, భద్రతే ధ్యేయం

సిద్దిపేటకమాన్: ప్రజల రక్షణ, భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పోలీసు సిబ్బందికి సూచించారు. కమిషనర్ కార్యాలయంలో బుధవారం బ్లూకోట్, పెట్రోకార్ అధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణం స్పందించాలన్నారు. డయల్ 100 కు కాల్ రాగానే పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తారని ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిపై నిఘా ఉంచాలన్నారు. అనుమానితులు, రౌడీలు, కేడీలను తరచుగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సీసీఆర్ ఏసీపీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రఘుపతి రెడ్డి, హుస్నాబాద్ సీఐ కిరణ్, ఐటీ సెల్ ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): పట్టణాలకు దీటుగా పల్లెలు మారేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవీరవిందర్ అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, గిరాయిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్‌లు రవీందర్, సంజీవరెడ్డితో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. పనుల్లో నాణ్యత, పారదర్శకతలు లోపించకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగ శ్రీనివాస్, కాసపురం నర్సింహారెడ్డి, స్వామి, కనుకసేనా, పీఏసీఎస్ ఈ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధిపై ఎందుకు వివక్ష

ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల మాదిరిగా దుబ్బాకకు ఎందుకు నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉన్న నిధులన్నీ వారి నియోజకవర్గాలకే కేటాయించుకుంటే రాష్ట్రమంతా అభివృద్ధి ఎలా జరుగుతుందన్నారు. మంత్రులుగా ఉండి ఏది పడితే అది మాట్లాడడం బాధాకరమన్నారు. దుబ్బాక ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ కావాలని అడిగితే దాన్ని పక్కన బెట్టి రాజకీయాలు మాట్లాడడం సరికాదన్నారు. వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరైతే పనులు ఎందుకు ప్రారంభిస్తలేరని ప్రశ్నించారు. తాను గెలిచాకనే 100 పడకల ఆస్పత్రి , దుబ్బాక మాడల్ బస్టాండ్ నిర్మించడం జరిగిందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, మచ్చ శ్రీనివాస్, పుట్ట వంశీ, రోశయ్య, ఎల్లారెడ్డి, ప్రవీణ్, రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



మాట్లాడుతున్న మంద పవన్

అక్కన్నపేట(హుస్నాబాద్): ధరణి పోర్టల్ ద్వారా వస్తున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, ధర్మారం, పోతారం(జే), నందారం గ్రామాల్లో బుధవారం ×పల్లె పల్లెకు సీపీఐ, ప్రజల వద్దకు సీపీఐ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో అర్హులను గుర్తించి వారికే అందేలా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ప్రభుత్వం కొంతమందికి ఇచ్చినట్లే ఇచ్చి వాపస్ తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేశ్, మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ప్రతాపం షురూ..



నిర్మానుష్యంగా సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా



ఉపశమనానికి సోడా, జ్యూస్ తాగుతున్న ప్రజలు



శివరాత్రి త్వరాత నుంచి వాతావరణంలో మార్పులు మొదలయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. రెండు రోజులుగా మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పనిసరి బయటకు వచ్చేవారు.. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు వేడిని తట్టుకోలేక దాహం తీర్చుకోవడానికి షోడా, జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. –సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

క్లుప్తంగా

నేటి నుంచి సిటీ పోలీసుయాక్ట్ అమలులో

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ ఎన్.శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే మార్చి 3వ తేదీ వరకు ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. వీటి నిర్వహణకు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు. బంద్‌ల పేరిట బలవంతంగా సంస్థలు, కార్యాలయాలు మూసివేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళ అదృశ్యం


బాలమణి (ఫైల్)

నర్సాపూర్: నర్సాపూర్ బస్టాండ్‌లో మహిళ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన బోరంచ బాలమణి ఈ నెల 15వ తేదీన నర్సాపూర్‌లో బస్టాండ్‌లో కనిపించకుండా పోయింది. ఈ ఘటనపై ఆమె కుటుంబసభ్యులు 21వ తేదీన ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, బాలమణి ఆచూకీ తెలిస్తే.. 94906 17054 నంబరుకు కాల్ చేయాలని ఎస్‌ఐ శివకుమార్ చెప్పారు.

రెండోరోజూ ఏసీబీ సోదాలు

కౌడిపల్లి(నర్సాపూర్): తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం ధరణి ఆపరేటర్ వేణురెడ్డి, మధ్యవర్తి రాజును ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్న విషయం తెలిసిందే. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరాజాగౌడ్, రమేష్‌తోపాటు సిబ్బంది సాయంత్రం వరకు సోదాలు నిర్వహించారు. లంచం తీసుకున్న ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచామన్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

మద్దూరు(హుస్నాబాద్): ఓ యువతిని నాలుగేళ్లుగా ప్రేమించానన్నాడు...శారీరకంగా లోబర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోమని అడిగేసరికి ఆ యువకుడు నిరాకరించాడు. దీంతో దూల్మిట్ట మండల పరిధిలోని కూటిగల్‌కు చెందిన జోగిని వంశీపై అత్యాచారం కేసు నమోదు చేసినట్టు సీఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ నారాయణ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందారు. రూరల్ ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సల్మాన్(28) ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం సిద్దిపేట పట్టణానికి వలసవచ్చాడు. పట్టణంలో సింగోజు శ్రీనివాస్ వద్ద వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. పనిలో భాగంగా బుధవారం చిన్నగుండవెల్లి పాఠశాలలో మన ఊరు–మనబడిలో భాగంగా భోజనశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే పైపులు అమర్చుతున్నారు. నిర్మాణ గదిపై విద్యుత్ తీగ ఉంది. పైపు విద్యుత్ తీగకు తగిలింది. దీంతో సల్మాన్ ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన తోటి పనివారు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సింగోజు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకం కలిగించాడని..

బెజ్జంకి(సిద్దిపేట): కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి నెలరోజుల జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే.. ఎల్లంపల్లికు చెందిన సంగెం రూపేష్ 2019లో బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ సుధాకర్ విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. బుధవారం కేసు విచారణకు రాగా హుస్నాబాద్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కృష్ణతేజ్ రూపేష్‌కు నెలరోజుల జైలు శిక్ష, రూ.7,500 జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు.

మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- నిర్మాణానికి రూ. 25 కోట్లు మంజూరు
- నేడు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన


ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేది ఇక్కడే..

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణ, సమీప గ్రామాల ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు అందించే లక్ష్యంతో మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మించనున్నారు. 2020లో సీఎం కేసీఆర్ సిద్దిపేటకు వచ్చినప్పుడు మంత్రి హరీశ్‌రావు మరో ఇంట్రిగ్రేటెడ్ మార్కెట్ కావాలంటూ ప్రతిపాదనలు అందజేశారు. మంత్రి చొరవతో దీని నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు అయ్యాయి. రెండో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో జెడ్పీ కార్యాలయ (బ్లాక్ ఆఫీస్)ఆవరణలో స్థలం గుర్తించారు. సిద్దిపేట బంజారాహిల్స్ గా పేరొందిన హౌసింగ్ బోర్డ్, మైత్రివనంతో పాటు ఆదర్శ్ నగర్, టెలికం నగర్, టీచర్స్ కాలనీ సమీప ప్రాంతాల్లో ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇక్కడే మార్కెట్ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు గురువారం శంకుస్థాపన చేయనున్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా...

వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రాల్లో సిద్దిపేట ముందువరుసలో ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాల కల్పనపై కూడా మంత్రి దృష్టి సారించారు. పట్టణంలో బల్దియా రికార్డుల ప్రకారం 47 వేల నివాసాల్లో రెండు లక్షల జనాభా ఉన్నారు. అందులో భాగంగానే మొదటగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు ప్రజల నుంచి స్పందన లభించింది. దీంతో పట్టణంలోనే రైతుబజార్ ఏర్పాటు చేసి దానికి అనుబంధంగా మరో మూడు చోట్ల రైతుబజార్లు ఏర్పాటు చేశారు.

తొలి మార్కెట్ ఇదే...

రాష్ట్రంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని పాత మార్కెట్‌లోనే ఐదేళ్ల క్రితం నిర్మించారు. ఇది ప్రజలకు అందుబాటులో ఉంది. ఇందులో వెజ్, నాజ్, ఫ్రూట్, ఫ్లవర్స్ విక్రయాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ మార్కెట్‌కు ఫుడ్ సేఫ్టీ సెక్యూరిటీ అథారిటీ గుర్తింపుతోపాటు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ కూడా లభించింది.

107 స్టాళ్లు.. 30 షాపులు

ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అన్ని వసతులు సమకూర్చనున్నారు. ప్రజలు, రైతులు దుకాణదారుల వాహనాల కోసం పార్కింగ్. 52 కూరగాయల స్టాళ్లు, 20 చికెన్, మటన్, ఫిష్ విక్రయ స్టాళ్లు, 20 పండ్ల స్టాళ్లు, 10 పువ్వుల విక్రయ స్టాళ్లు నిర్మించనున్నారు. ఫస్ట్ ఫ్లోర్ లో 30 దుకాణాలతోపాటు రెండు కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తారు.

ప్రజల అవసరాలను గుర్తించి..



సిద్దిపేట ప్రజల అవసరాలను గుర్తించి అదనంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆశీస్సులతో ముందుకుసాగుతున్నాం.

–హరీశ్‌రావు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి

భార్యను చంపింది భర్తే


సీఐ భిక్షపతితో కలిసి మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి

సిద్దిపేటకమాన్: వివాహిత హత్యకేసును పోలీసులు ఛేదించారు. హత్య చేసింది భర్తనే అని తేల్చారు. సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో వన్‌టౌన్ సీఐ భిక్షపతితో కలిసి ఏసీపీ దేవారెడ్డి బుధవారం ఆ వివరాలు వెల్లడించారు. మిరుదొడ్డి మండలం కొండాపూర్‌కు చెందిన వివాహిత సుజాత సిద్దిపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్ సమీపంలో ఈ నెల 18వ తేదీన రాత్రి హత్యకు గురైంది. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సుజాత భర్త లింగంను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా, తానే హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. తాగుడుకు బానిసైన లింగం డబ్బుకు ఇబ్బంది పడుతుండేవాడు. ఈ క్రమంలోనే భార్యతో గొడవ జరిగింది. సంఘటనస్థలంలోనే చంద్రశేఖర్ ఉన్నాడు. ఆయన ఎదుటే భార్య జుట్టుపట్టి నేలకు కొట్టి గొంతు నులిమి చంపాడు. హత్య చేసిన లింగం, అక్కడే ఉన్న చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా కేసును ఛేదించిన సీఐ భిక్షపతి, ఎస్‌ఐ నరసింహారావు, క్రైమ్ పార్టీ సిబ్బంది భూమలింగం, కనకరాజు, రాజులను ఏసీపీ దేవారెడ్డి అభినందించారు.


చెట్టుకు గుద్దుకున్న శివరాజ్

ప్రాణం తీసిన అతివేగం

టేక్మాల్(మెదక్): అతివేగం..అజాగ్రత్త ఓ నిండు ప్రాణం బలి తీసుకుంది. టేక్మాల్ ఏఎస్‌ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం...సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన మంగళి శివరాజ్(42), అదే గ్రామానికి చెందిన వాహబ్‌తో కలిసి మంగళవారం ఉదయం బైక్‌పై ఏడుపాయలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో రాత్రివేళ టేక్మాల్ మండలంలోని కాద్లూర్ శివారుకు వచ్చాక బైక్‌ను వేగంగా నడపడంతో రోడ్డుపక్కన ఉన్న హరితహారం గుంతలో పడి చెట్టును ఢీకొట్టి ముళ్లపొదలో పడ్డారు. దీంతో బైక్ నడుపుతున్న శివరాజ్‌ను తీవ్రగాయాలు అయ్యాయి. వెనుక కూర్చున్న వాహబ్‌కు స్వల్పగాయాలయ్యాయి. 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో శివరాజ్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు శరణప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో వేర్వేరు చోట్ల బుధవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

మద్యం మత్తులో...

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. భానూర్– బీడీఎల్ స్టేషన్ పరిధిలోని హెడ్‌కానిస్టేబుల్ అక్తర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్‌కు చెందిన సాయికుమార్(37) తన భార్య అరుణతో కలసి 2012లో రామచంద్రాపురం పరిధిలోని ఈదుర్ నాగులపల్లికి బతుకుదెరువుకు వచ్చాడు. భార్య స్వస్థలం ఇక్కడే కావడంలో ఆమె తల్లిగారింటికి సమీపంలో ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం రాత్రి తాగిచ్చి అత్తగారింటికి వెళ్లాడు. భార్యను ఇంటికి రమ్మని అడగ్గా ఆరోగ్యం బాగాలేదని రానని చెప్పింది. దీంతో సాయికుమార్ నేరుగా తన ఇంటికి వెళ్లాడు. భార్య చీరతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. దీంతో స్థానికుల సహకారంతో ఇంటి లోపలికి వెళ్లిచూడగా, సాయికుమార్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత...

అక్కన్నపేట(హుస్నాబాద్): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. అక్కన్నపేటకు చెందిన రమేష్‌కు పదేళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన టేకుల మనీషా(26)తో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం మనీషా ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే కారణాలు తెలియడం లేదు. ఈ విషయమై ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ను సంప్రదించగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని, రాగానే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక...

- పురుగుల మందు తాగిన భర్త.. చికిత్స పొందుతూ మృతి
- అనాథలైన ఇద్దరు పిల్లలు


చాకలి వరుణ్ (ఫైల్)


పిల్లలు నిఖిలేష్, మోక్షిత

సిద్దిపేటరూరల్: నాలుగునెలల క్రితం భార్య ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణం ఆయన్ను మనోవేదనకు గురిచేసింది. భార్య లేని తాను ఈ లోకంలో ఉండలేనని ఆ భర్త పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. ఎస్‌ఐ విఠల్ చెప్పిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన చాకలి వరుణ్ (26) ఆటో నడుపుతుండగా, భార్య లావణ్య ఇళ్లలో పనిచేసేది. వీరికి నిఖిలేష్(4), మోక్షిత(2) సంతానం. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వరుణ్ భార్య లావణ్య నాలుగు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి చిన్నారుల ఆలనాపాలనా తండ్రి చూసుకునేవాడు. భార్య మరణం వరుణ్‌కు కుంగదీసింది. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లోనే గడ్డి మందు తాగాడు. గమనించిన వరుణ్ చిన్నాన్న అంజయ్య వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వం స్పందించి అనాథలైన ఇద్దరు చిన్నారులను అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భార్య సౌందర్య

పటాన్‌చెరు టౌన్: భర్త ఇంటి ఎదుట ఓ భార్య ఆందోళన చేసిన సంఘటన పటాన్‌చెరులో చోటుచేసుకుంది. బాధితురాలు సౌందర్య తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్‌కు చెందిన లింగం సంతోష్ బతుకుదెరువు కోసం పట్టణంలోని అంబేడ్కర్‌కాలనీకి వచ్చాడు. ముత్తంగి గ్రామానికి చెందిన సౌందర్యను 2019లో ఆర్యసమాజంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లికి కేవలం సౌందర్య కుటుంబసభ్యులే హాజరయ్యారు. అప్పుడే మీ కుటుంబసభ్యులు ఎక్కడా అని సంతోష్‌ని అడగ్గా అమ్మ ఉందని, ఆమెకు నచ్చజెప్పుకుంటానని నమ్మించాడు. పెళ్లి తర్వాత ఇస్నాపూర్‌లో కాపురం పెట్టారు. వీరికి ఒక పాప కూడా ఉంది. అయితే సంతోష్ సౌందర్యను పెళ్లి చేసుకున్న విషయం తన కుటుంబసభ్యులకు చెప్పలేదు. మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడన్న సమాచారం తెలుసుకున్న సౌందర్య పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలంటూ బుధవారం భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది.

ఓయూలో రేపు పీహెచ్‌డీ అభ్యర్థుల సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆర్ట్స్ కాలేజీ వేదికగా శుక్రవారం ఉదయం 10 గంటలకు పీహెచ్‌డీ అభ్యర్థుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు బుధవారం ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు చెప్పారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు ఓయూ అధికారులు అర్హత మార్కుల విషయంలో అవలంబిస్తున్న విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజ్వరేషన్లు, బీసీ, ఓసీ విద్యార్థులకు కాకతీయవర్సిటీ మాదిరి అర్హత మార్కుల కుదింపు తదితర అంశాలపై జరిగే సమావేశానికి అభ్యర్థులు ర్యాంకు కార్డులతో హాజరుకావాలని సూచించారు.

నేడు జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఖురాన్' వివరణపై జాతీయ స్థాయి సదస్సు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అరబిక్ విభాగం ఆధ్వర్యంలో కేరళలోని ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్ ఖురాన్ (ఐఆర్ఐటీఏక్యూ) సహకారంతోఈ సదస్సును నిర్వహిస్తారన్నారు.

కనీస సౌకర్యాల కల్పనలో విఫలం



మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని అహ్మద్‌నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం అహ్మద్‌నగర్‌లో ఆయన పర్యటించారు. అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్‌లో అధికార పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఎమ్మెల్యే గాంధీ రాత్రి పర్యటనల పేరుమీద జిమ్మిక్కులు చేస్తున్నారని అభివృద్ధిని గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. అహ్మద్‌నగర్‌లో కనీస సౌకర్యాలు డ్రైనేజీ, నీరు, రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యరమేష్, పాషా, రంజాన్, మోయన్, అహ్మద్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. రాజ్‌కుమార్ యాదవ్ స్మారక క్రికెట్ టీ -20 టోర్నమెంట్‌ను లింగంపల్లిలోని లేగల స్పోర్ట్స్ గ్రౌండ్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ ఆర్.కేవై ఫౌండేషన్ నిర్వాహకులను, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్ లేగల వెంకట్‌రెడ్డి పటేల్, నాయకులు రాఘవేందర్‌రావు, కర్చర్ల ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రాధాకృష్ణ యాదవ్, రమేష్, సోమయ్య యాదవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై జర జాగ్రత్త

- భద్రత చర్యలు మరిచిన కాంట్రాక్టర్
- రోడ్డు వెడల్పు కోసం తీసిన గోతుల్లో పడి ఓ ఉద్యోగి మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): అది మూడు జిల్లాలను కలిపే జాతీయరహదారి కావడంతో విస్తరణ పనులు ఇటీవల మొదలయ్యాయి. అయితే ఈ సిద్దిపేట–హన్మకొండ రోడ్డుపై ఎటువంటి భద్రత చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఓ నిండు ప్రాణం బలైంది. రోడ్డుకు ఒకవైపు కంకర, యాష్ నింపేందుకు తవ్వారు. తవ్విన చోట, పనులు ప్రారంభమైన మొదట, చివరగానీ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళ ఈ రోడ్డు ప్రయాణం చేసేవారికి ఎక్కడ రోడ్డు తవ్వారో కూడా తెలియని పరిస్థితి. కనీసం ఎక్కడా బారికేడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఇదే రోడ్డుపై నాగసముద్రాల సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సుధాకర్ సోమవారం రాత్రి ప్రయాణం చేస్తూ రోడ్డు విస్తరణకు తవ్వినచోట పడి మృతి చెందాడు. సుధాకర్ సహోద్యోగి ఫిర్యాదు చేసినా, రోడ్డు విస్తరణ పనులు చేపట్టే కంపెనీ ఎటువంటి భద్రతచర్యలు చేపట్టలేదు.




సూచికబోర్డు కూడా లేని బస్వాపూర్ రోడ్డు

మొక్కజొన్నకే మొగ్గు

- యాసంగిలో రికార్డుస్థాయిలో సాగు
- పత్తి, ఆలుగడ్డ తీశాక రెండో పంటగా ప్రాధాన్యం


జహీరాబాద్‌లో సాగయిన మొక్కజొన్న

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో మొక్కజొన్న సాగు పెరిగింది. దాదాపు 25 వేల ఎకరాల్లో పంట సాగైనట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా భూగర్భజలాలు పెరిగాయి. దీంతో రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపారు. ఫలితంగా సాగువిస్తీర్ణం భారీగా పెరిగింది. గతయాసంగిలో జిల్లావ్యాప్తంగా 5వేల ఎకరాల్లో కూడా మొక్కజొన్న సాగు కాలేదు. కానీ తాజా నాలుగైదు రెట్లు సాగు విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయ బావులు, బోర్లలో సమృద్ధిగా నీరు ఉండడం, మొక్కజొన్నకు మార్కెట్ మంచి ధర పలుకుతుండడం కూడా సాగు విస్తీర్ణం పెరిగేందుకు కారణమైందని చెప్పవచ్చు.

పత్తి, ఆలుగడ్డ తీశాక సాగు

వానాకాలం మొదట్లో వేసిన పత్తి, అక్టోబర్, నవంబర్ మాసాల్లో విత్తిన ఆలుగడ్డ పంటలు చేతికి వచ్చాక, మొక్కజొన్నసాగుకు రైతులు సిద్ధమయ్యారు. పత్తి తీశాక రెండో పంటగానూ, సోయాబీన్ వేసుకున్న వారు ఆలుగడ్డ రెండో పంటగా, అది తీశాక మూడో పంటగా మొక్కజొన్న సాగు చేశారు. అయితే పలుచోట్ల పత్తితీత పూర్తికాక పోయినా, చివరిదశలో ఉన్నా, పత్తికోసం ఎదురు చూడకుండా అది పీకేసి మొక్కజొన్న వేశారు. దీంతోనే సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాకాలంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్న చోట శనగసాగుకు బదులు రెండోపంటగా మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపారు. శనగకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడం, పంట దిగుబడి అంతంతమాత్రంగానే వస్తుండడం నిరాసక్తత కారణం.

పది ఎకరాల్లో మొక్కజొన్న వేశా



ఈయాసంగిలో 10 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ఇతర పంటలు సాగు చేయడం వల్ల అంతంత మాత్రంగానే లాభాలు వస్తున్నాయి. పెట్టుబడులు కూడా ఎక్కువ అవుతున్నాయి. గతంలో ఉల్లిగడ్డ అధికంగా సాగుచేశా. ఖర్చు పెరగడం, నిల్వ సదుపాయం లేకపోవడంతో మొక్కజొన్న వేశా.

–ఎస్.అంజిరెడ్డి, పైడిగుమ్మల్ రైతు

నీళ్లున్నాయని...



ఈ ఏడాది బోర్లలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేసిన. ఇతర పంటల వల్ల ఉపయోగం కనిపించలేదు. వర్షాకాలంలో సాగు చేసిన పంటలకు ఆశించిన మేర దిగుబడి రాలేదు.

–మహమ్మదల్లీ, కోహీర్ రైతు

విస్తారంగా సాగైంది



రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారు. నీటివసతి చూసుకొని ఇతర పంటల వైపునకు వెళ్లకుండా మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు.

–భిక్షపతి, జహీరాబాద్ ఏడీఏ